క్లుప్తంగా

ఎమ్మెల్సీ తోటను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి



మండపేటలో ఎమ్మెల్సీ తోటతో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

కపిలేశ్వరపురం (మండపేట): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును శనివారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాముల దేవీ ప్రకాష్ కలిశారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో తోటను మర్యాదపూర్వకంగా కలసి జిల్లాలోని సామాజిక సమస్యలపై చర్చించారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాజులూరు: ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. గ్రామంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో శనివారం పోలీసులు ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై ఎవరైనా అభ్యంతరకరంగా ప్రవర్తించినా పోలీసులకు ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. ఈవ్ టీజింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా దసరా వేడుకలు

కపిలేశ్వరపురం: వల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం దసరా వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం చిట్టూరి శ్రీధర్ పర్యవేక్షణలో విద్యార్థులు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.సుబ్బారావు, రామ తులసి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

రాయవరం: మండలంలోని వెంటూరులో వేంచేసిన ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి లక్షపత్రి పూజ చేశారు. పిండిప్రోలు సుబ్బారావు దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు మద్దిరాల సాయికిరణ్, ఋత్వికులు వింజమూరి సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సూరిబాబు, కోరుమిల్లి కామేశ్వరరావు, మైలవరపు సూర్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరికరాల వినియోగంతో మేలు



మండపేటలో రైతులకు డ్రోన్ అందజేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): వ్యవసాయంలో సాంకేతిక పరికరాల వినియోగంతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద రైతులకు డ్రోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండపేట మండలానికి రూ.29.40 లక్షల విలువైన మూడు డ్రోన్లు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులకు సబ్సిడీ రూపంలో రూ. 23.52 లక్షలు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. నాయకులు నల్లమిల్లి వీరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కుక్కల రామారావు, మేడిశెట్టి శ్రీనివాస్, ఎంపీడీ ఓ కె.సత్యనారాయణ, వ్యవసాయ అధికారులు కె.ప్రభాకరరావు, బలుసు రవి పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ హైస్కూల్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మాదక ద్రవ్యాలు వాడుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 9, 10 తరగతులు విద్యార్థులతో మంత్రి సుభాష్ నేరుగా వారి క్లాస్ రూంలో వారితో మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు చేరువైన పది మంది విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా గుట్కా, సిగరెట్లు, మత్తు పానీయాలు పాఠశాలలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో మాదక ద్రవ్యాలకు విద్యార్థులు అలవాటు పడ్డారంటూ ఆకస్మిక తనిఖీ చేయడంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో కాసేపు ఏం జరుగుతుందో అర్థం కాక గందరగోళం ఏర్పడింది.

క్రమబద్ధీకరణతో బహుళ ప్రయోజనాలు

- విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు మరో అవకాశం
- డిసెంబర్ నెలాఖరు వరకూ గడువు పెంపు
- రెండు నియోజకవర్గాల్లో 1,46,732 కనెక్షన్లు



అంగర విద్యుత్ సబ్ స్టేషన్

కపిలేశ్వరపురం: విద్యుత్ మీటరు మొదటిసారిగా తీసుకునేవారు విద్యుత్‌శాఖ నిర్దేశించిన రుసుములు చెల్లించి కనెక్షన్ తీసుకోవాలి. ఆ సమయంలో ఇంటి వినియోగం ఎంతో అంచనా వేసుకుని లోడును నిర్ధారించుకుంటారు. లోడుకు తగినట్టు రుసుము చెల్లించి కనెక్షన్ వినియోగాన్ని ప్రారంభిస్తారు. అయితే వినియోగంలో కనెక్షన్ తీసుకున్నప్పుడు నిర్దేశించుకున్న లోడుకు ఇంచుమించుగా విద్యుత్ వాడకంలో కొద్దిపాటి మార్పులు ఉంటాయి. లోడులో పొందుపర్చిన దానికి అదనంగా విద్యుత్ వాడితే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ లోడును ప్రస్తుత వినియోగానికి అనుగుణంగా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. డిసెంబర్ చివరి వరకూ గడువును పెంచారు. విద్యుత్ వాడకానికి తగినట్టుగా లోడును మార్పు చేసుకోవడం ద్వారా అపరాధ రుసుము చెల్లింపు సమస్య నుంచి బయటపడవచ్చు.

రూ.61,59,540 చెల్లింపు

రామచంద్రపురం డివిజన్ పరిధిలోని 1,46,732 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారులు జూన్ 30 వరకూ 4,707.49 కిలోవాట్ల అదనపు విద్యుత్ వినియోగానికి సంబంధించి క్రమబద్ధీకరణ కోసం రూ.61,59,540 రుసుముగా చెల్లించి సర్వీసులను క్రమబద్ధీకరించుకున్నారు.

సూర్యఘర్ పథకంలో క్రమబద్ధీకరణ లోడ్ ఇలా..

సూర్య ఘర్ పథకం వినియోగించుకోవాలంటే గృహ సర్వీసుకు కనీస లోడు మూడు కిలోవాట్లు వాడాలి. వాడకం అంత లేకపోతే పథకానికి దరఖాస్తు చేసుకున్న తర్వాత కిలోవాట్‌కు అన్ని చార్జీలు కలిపి రూ.2,250 చొప్పున చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి.

ప్రయోజనాలు ఇలా..

సాధారణంగా కిలో వాట్ లోడ్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు ధరావత్తు సొమ్ముగా రూ.200, డెవలప్‌మెంట్ చార్జిగా రూ.2 వేలు, దరఖాస్తు రుసుముగా రూ.50 చెల్లించాల్సి వస్తుంది. క్రమబద్ధీకరణ పథకంలో కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జిగా రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుంది. లోడు పెంపు ఆధారంగా మిగిలిన రుసుములు చెల్లించాల్సి వస్తుంది. వాస్తవానికి ప్రతి కిలోవాట్‌కు 50 శాతం రాయితీని ప్రకటిస్తూ ఈ ఏడాది మార్చి 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ విద్యుత్ శాఖాధిరులు గడువు ఇచ్చారు. ఆ గడువును మరోసారి డిసెంబర్ 31కి పెంచారు.

రెండు నియోజకవర్గాల్లో జూన్ 30 వరకూ విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ వివరాలిలా..

సెక్షన్	కనెక్షన్లు	అదనపు లోడుకు చెల్లించవలసిన సర్వీసులు	చెల్లించిన సొమ్ము (రూ.లక్షల్లో)
రామచంద్రపురం	19,362	454	10,25,670
ద్రాక్షారామ	18,540	277	7,03,140
పామర్రు	17,847	304	7,01,430
కపిలేశ్వరపురం	20,318	437	8,73,620
మండపేట	23,010	334	8,00,580
ఏడిద	7,050	236	5,26,310
ద్వారపూడి	18,579	132	3,27,480
రాయవరం	22,026	481	12,01,310
మొత్తం	1,46,732	2,655	61,59,540

సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఉన్నతాధికారులు మరోసారి గడువు పెంచారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. డిసెంబర్ 31 వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తులు స్వీకరిస్తాం.

ఎస్.సత్యనారాయణ,
ఏఈ, అంగర విద్యుత్ సబ్ స్టేషన్

పెరుగుతున్న గోదావరి వరద



కోటిపల్లి వద్ద గోదావరి ప్రవాహం

కె.గంగవరం: కాటన్ బ్యారేజ్ వద్ద మిగులు జలాలను సముద్రంలోనికి వదలడం వల్ల మండల పరిధిలోని కోటిపల్లిలో వరద ఉధృతి మళ్లీ పెరిగింది. గత రెండు వారాల వ్యవధిలో గోదావరి ఉధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరగడం ఇది మూడోసారి జరిగింది. కోటిపల్లి ఫెర్రిలోని పుష్కర ఘాట్ మెట్లు వరకు మునిగి వరద నీరు ప్రవహిస్తోంది. సుందరపల్లి వద్ద గోదావరి గట్టు బలహీనంగా ఉండడంతో గట్టును పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పీడబ్ల్యూడీ ఏఈ రెహమాన్ తెలిపారు. ఉధృతి ఇంకా కొనసాగడంతో గత నెల రోజులుగా పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు నిలిపి వేశారు. ఉధృతి పూర్తిగా తగ్గిన తరువాత ముక్తేశ్వరం వైపు కంకర రహదారి నిర్మించిన అనంతరం కాకపోకలు కొనసాగిస్తామని అధికారులు చెప్పారు.

అర్తమూరులో హోమియో వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు లలిత, యశస్విని, మనోజ్ కుమార్, నాయక్, సుమమాధురి, పద్మావతి రోగులకు వైద్య సేవలు అందించారు. క్రమం తప్పకుండా ఉచిత హోమియో శిబిరాలు నిర్వహిస్తున్న బులిస్వామిరెడ్డి సేవలను సామాజిక కార్యకర్త పడాల రామచంద్రారావు ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, డైరెక్టర్ సత్తి సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, సత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మానవత సేవా సంస్థ సభ్యులు 15 కుర్చీలను సమకూర్చారు. వాటిని శనివారం పాఠశాల హెచ్‌ఎం బి.రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులకు అందజేశారు. దాతలను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పళ్ల సన్యాసిరావు, పడగల శ్రీనివాస్, డాక్టర్ నాగులాపల్లి సీతారామ స్వామి నాయుడు, కోట లక్ష్మన్, పంతంగి ఏడుకొండలు, తట్టవర్తి రమేష్, పల్లా వాసు, సత్తి రాంబాబు పాల్గొన్నారు.

కూళ్లలో బంగారు వస్తువుల చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జానీబాషా

కె.గంగవరం: కూళ్ల గ్రామంలో శనివారం సాయంత్రం చోరీ జరిగింది. కె.గంగవరం ఎస్సై జానీభాషా తెలిపిన వివరాల ప్రకారం.. కూళ్ల గ్రామానికి చెందిన రిటైర్డు ఎంపీడీఓ కార్యాలయ టైపిస్టు చిట్టూరి అనంతలక్ష్మీ సత్యవతి గ్రామంలో కొత్త ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణం కోసం కూళ్ల గ్రామ పరిధిలోని ఊరి చివర మండువాలోగిలో అద్దెకు ఉంటున్నారు. అక్కడ ఉంటూ కొత్త ఇంటి నిర్మాణ పనులు చూసుకుంటున్నారు. రోజులాగానే ఆమె శనివారం కొత్త ఇంటి వద్దకు వెళ్లి పనులు చూసుకుని తిరిగి సాయంత్రం అద్దె ఇంటికి వచ్చారు. ఇంటిలోకి వెళ్లి చూసే సరికి బీరువా తలుపులు తీసి ఉండడం గమనించారు. తర్వాత బీరువా చూసే సరికి సుమారు 145 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలపైనే ఉంటుంది. బంగారం చోరీకి గురయిందని గుర్తించిన ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత కె.గంగవరం ఎస్సై జానీభాషాకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును చేధించే ప్రక్రియ మొదలుపెట్టారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కె.గంగవరం: మొక్కలే ప్రపంచానికి జీవనాధరమని, మొక్కలు నాటి పెంచడం ద్వారా అవి పర్యావరణాన్ని పరిరక్షిస్తాయని అముజూరు గ్రామ సర్పంచ్ నానాపరపు కల్యాణి, కుందూరు సొసైటీ జగతా రమణ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సక్రమంగా ఎదిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మార్పులు చెందడానికి కారణం చెట్లు నరకడం, మొక్కలను తొలగించడం వల్లేనన్నారు. ప్రకృతి, వాతావరణం సక్రమంగా ఉండాలంటే పచ్చదనం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు కడలి గౌరీశంకర్, ప్రసాద్, గ్రామ పెద్దలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ద్వారా మెరుగైన వాతావరణం రూపుదిద్దుకుంటుందని ద్వారపూడి గ్రామ కార్యదర్శి ఆకుల వెంకటరమణ అన్నారు. పంచాయతీ కార్యాలయ సమీపంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో శనివారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కంకటాల మురళీకృష్ణ, యరగతపు బాబ్జి,అడబాల బుల్లబ్బులు, పళ్లా సన్యాసిరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడీవేడిగా పరిషత్ సమావేశం



సమావేశంలో శాఖల వారీగా ప్రగతిని వివరిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన శనివారం వాడీవేడిగా జరిగింది. 2016 సంవత్సరంలో అప్పటి చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో పంచాయతీల్లో వేసిన ఎల్‌ఈడీలకు ఇప్పుడు పంచాయతీ సర్పంచులను బెదిరించి మరీ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదని వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం ధ్వజమెత్తారు. పలువురు సర్పంచులు ఆయనకు మద్దతు పలుకుతూ పంచాయతీల్లో జీతాలు చెల్లించడానికే ఇబ్బందులు పడుతుంటే ఎప్పటివో బిల్లులు చెల్లించమని ఒత్తిడి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం ఇచ్చిన తరువాత బస్సులు అవసరమైన మేరకు పెంచకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో రిక్వెస్ట్ స్టాప్ దగ్గర బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తానే స్వయంగా ఈ సమస్యను ఎదుర్కొన్నానని చోడవరం సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ తెలిపారు. గత సమావేశాల్లో చర్చించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని మళ్లీ సమావేశం అయినప్పుడు మళ్లీ అవే సమస్యలు చెప్పుకోవలసి వస్తుందని పలువురు మండిపడ్డారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రొటోకాల్‌పాటించడంలేదని పలుమార్లు సభ దృష్టికి తీసుకుని వచ్చిన పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని దుయ్యబట్టారు. పలు శాఖల అధికారులు మండల సమావేశానికి హాజరు కాకపోవడంపై ఎంపీపీ భవాని సీరియస్ అయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ జాగారపు రాంబాబు, డిప్యూటీ ఎంపీడీఓ పెట్టా సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల డిమాండ్లు నెరవేర్చాలి

రామచంద్రపురం: కనీస వేతనం పెంచాలని, నామినీ వీఆర్‌ఏలకు ఉద్యోగ ఉన్నతి కల్పించాలని అర్హులైన వీఆర్‌ఏలు, నైట్ వాచ్‌మన్‌లు, అటెండర్లకు వీఆర్‌ఓలుగా ప్రమోషన్‌లు కల్పించాలని తదితర వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలు ప్రభుత్వానికి తమ నిరసన తెలుపుతూ రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మద్దాల బాపూజీ వీరికి మద్దతు ప్రకటించారు. అనంతరం వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రరావు ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం రామచంద్రపురం మండల అధ్యక్షుడు కొనమంచిలి ఆనంద్ కుమార్, రాయవరం అధ్యక్షుడు సీహెచ్ వీరబాబు, కపిలేశ్వరపురం అధ్యక్షుడు పలివెల నాగేశ్వరరావు, నాయకులు విక్కీ, అడపా శివ ప్రసాద్, కె.ఆనంద్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత



మండపేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



మంజేరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు విష్ణువర్ధన్



అంగరలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత అని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌ను నిర్వహిస్తుందని తెలిపారు. మండపేట పట్టణంలోని 20 వార్డు అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్యాధికారి వి.భవాని ఆధ్వర్యంలోని వైద్య బృందం మహిళలకు బీపీ, షుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు.

కపిలేశ్వరపురం మండలంలో..

అంగర గ్రామ సచివాలయం వద్ద శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ వాకా కోటేశ్వరరావు ప్రారంభించారు. ఎంపీడీఓ భానూజీ, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జి.రాజేంద్ర ప్రసాద్, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, కార్యదర్శి మోహన్ ప్రసంగించారు. వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని కోరుమిల్లి సచివాలయం వద్ద వైద్య శిబిరంలో డాక్టర్ రాకేష్ చౌదరి సేవలందించారు. మహిళలకు బీపీ, షుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల నివారణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ సంక్షేమం

కాజులూరు: మహిళలే ఆ కుటుంబానికి వెన్నుముక లాంటివారని, వారి ఆరోగ్యంపైనే కుటుంబ సంక్షేమం ఆధారపడి ఉంటుందని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.సౌజన్య అన్నారు. శనివారం మంజేరులో వైద్యాధికారులు స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జీవీఎల్ శ్రేయ, డాక్టర్ జి.సౌజన్య, డాక్టర్ ప్రత్యూష తదితర వైద్యులు శిబిరానికి వచ్చిన 140 మందికి వైద్యసేవలు అందించారు. అదేవిదంగా కాజులూరు-2 సచివాయంలో జరిగిన కార్యక్రమంలో దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుప్రియ, కంటి వైద్యులు జి.భారతి తదితరులు పాల్గొని 160 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ల్లు గుంటూరి అప్పారావు, దండంగి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కూళ్లలో...

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అన్ని విధాలు బాగుంటుందని పామర్రు పీహెచ్‌సీ వైద్యులు విష్ణువర్ధన్, హర్షిత అన్నారు. మండల పరిధిలోని కూళ్ల గ్రామంలో స్వస్థ నారీ సుశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేని అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి వీరప్రకాష్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ కామేశ్వరరావు, బాగ్యవతి, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నత్రజని అధికంగా వాడితే ముప్పు



చెల్లూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రమేష్‌కుమార్

రాయవరం: నత్రజని అధికంగా వాడిన పొలాల్లో పంటను సుడిదోమ ఆశిస్తోందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరులో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. దగ్గరగా వరినాట్లు వేసిన, మురుగునీటి పారుదల సమస్య ఉన్న పొలాల్లో పంటను సుడిదోమ ఆశిస్తుందన్నారు. నీటి యాజమాన్యం, సుడి దోమ నివారణపై అవగాహన కల్పించారు. వరిచేలు ఈనిక దశలో ఒక దుబ్బుకి 20 నుంచి 25 పురుగులు మించి ఉంటే పురుగు మందులు వాడాలని సూచించారు. మిత్ర పురుగులైన సాలీడు, కోకో కోలా బిళ్ల పురుగులు సుడి దోమ ఉధృతిని తగ్గిస్తాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలంలో వేప గింజల కషాయాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కె.బాబూరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పశుపోషణతో మంచి ఫలితాలు



టేకిలో పశువులకు టీకాలు వేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ మంచి ఫలితాలను ఇస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.వెంకటరావు రైతులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శనివారం టేకిలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ కె.మాధురి, ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలోని పశువైద్య శాఖ సిబ్బంది 323 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పశు పోషణలో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా పాల దిగుబడితో పాటు రైతుల ఆర్థిక ప్రయోజనాలు సైతం మెరుగవుతాయన్నారు. రైతులు పశు వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ నెల 22న వెదురుమూడి, 23న పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, కేదారిలంక, 25న అద్దంకివారిలంక గ్రామాల్లో పశువులకు టీకాలను వేయనున్నట్టు పశువైద్యాధికారులు రమణమూర్తి, మాధురి తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు పనుల పరిశీలన

రామచంద్రపురం రూరల్: స్థానిక సచివాలయ భవనంలో మూడు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు చేపట్టిన పనులను జెడ్పీ సీఈఓ ఎం.లక్ష్మణ్ శనివారం పరిశీలించారు. ఈ భవనంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయం, డీఎల్‌పీఓ, ఏపీడీ కార్యాలయాలు ఏర్పాటుకు సంబంధించి జెడ్పీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పనుల ప్రగతిని సీఈఓ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ పెట్టా సత్యనారాయణ, మండల పరిషత్ సిబ్బంది అరుణ్ సాయి, దిలీప్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటపల్లి సూర్యారావుకు నివాళి

రామచంద్రపురం రూరల్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం తండ్రి వెంటపల్లి సూర్యారావు(85) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్వగ్రామం కందులపాలెంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, కె.నవీన్, పీవైఎల్ నాయకులు చింతా రాజారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు వానపల్లి నాగరాజు, వెంటపల్లి రామకృష్ణ, వి.సత్యానారాయణ, యు.కార్తిక్, దొరబాబు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఫ్ చెక్కులను శనివారం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 14 మందికి మంజూరైన రూ.13,12,448 విలువైన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు.